క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు అమలు చేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ రఘుచందర్

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ట్రాఫిక్ నిబంధనలు కఠినతరం చేసి ప్రమాదాలు జరగకుండా కఠిన చర్యలు చేపట్టాలని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను సోమవారం సాయంత్రం తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి మాట్లాడారు. జిల్లా కేంద్రంలో వాహనాల రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ నిబంధనలు కఠినంగా వ్యవహరించేలా సిబ్బంది పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ కరుణాకర్, ట్రాఫిక్ ఎస్సై మల్లేశ్ పాల్గొన్నారు.

డెలివరీల వివరాలు ఇవ్వాలని వినతి



వినతి పత్రం ఇస్తున్న హ్యూమన్‌రైట్స్ సభ్యులు

జగిత్యాల: జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో డెలివరీలకు సంబంధించిన వివరాలు ఇవ్వాలని, సిజేరియన్లు అత్యధికంగా జరుగుతున్నాయని, వాటిని నివారించేలా చర్యలు తీసుకోవాలని హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెంటనే వివరాలు ఇవ్వాలని, దీనిపై పోరాటం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు నక్క గంగారాం, రాథోడ్, పద్మ పాల్గొన్నారు.

మా ఊరి భూములు కాపాడండి



ఫిర్యాదు చేస్తున్న గోధూర్ గ్రామస్తులు

ఇబ్రహీంపట్నం: తమ ఊరి భూములను కాపాడాలని గోధూర్ గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆర్‌ఐ రేవంత్‌రెడ్డికి విన్నవించారు. గ్రామశివారులోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయ భూములు, పోచమ్మగుడి దారి పక్కన ఉన్న భూమి, సర్వే నంబర్ 299, 300లో గల 10 గుంటల భూమిని కూడా అక్రమార్కులు కబ్జా చేస్తున్నారని, ఈ భూములు కబ్జా కాకుండా సర్వే చేసి హద్దులను నిర్ణయించాలని విన్నవించారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఎడపెల్లి వెంకటస్వామి, ఉపాధ్యక్షుడు ప్రవీణ్, కోశాధికారి రాధారావు రాజ్, సభ్యులు పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు

ధర్మపురి: మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి జైలు శిక్ష విధించినట్లు జూనియర్ సివిల్ జడ్జి యోగి జానకి తీర్పునిచ్చారు. ధర్మపురిలో ఆదివారం సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై ఉదయ్‌కుమార్ వాహనాల తనిఖీ చేపట్టగా, ముగ్గురు వ్యక్తులు మద్యం తాగి పట్టుబడ్డారు. సోమవారం ధర్మపురి కోర్టు వారిని ప్రవేశపెట్టగా, గాదెపెల్లికి చెందిన వెలుగు ప్రేమ్‌సాగర్‌కు రెండు రోజులు, జైనా గ్రామానికి చెందిన సాయిని తిరుపతికి రెండు రోజులు, లక్షెట్టిపేట మండలంలోని హాజీపూర్‌కు చెందిన కరుకూరి శ్రావణ్‌కుమార్‌కు ఐదు రోజులు జైలు శిక్ష విధించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పదని ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు.

ఆగని అజ్మత్ అలీ పోరాటం



కాగితాలతో అజ్మత్‌అలీ

జగిత్యాలటౌన్: ధర్మపురిలో 2014లో నిర్వహించిన గోదావరి పుష్కరాల నిధుల్లో రూ.పదిలక్షల అవినీతి జరిగిందంటూ అదే పట్టణానికి చెందిన అజ్మత్‌అలీ పోరాడుతూనే ఉన్నాడు. సాక్ష్యాలు, ఆధారాలతో సోమవారం ప్రజావాణికి కలెక్టర్ సత్యప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అధికారులు మాత్రం ఒకసారి ఫైల్ దొరకడం లేదని, ఫైల్‌కోసం మున్సిపాలిటీకి లేఖ రాశామని దాటవేస్తున్నారని అలీ ఆవేదన వ్యక్తం చేశారు.

‘ఇందిరమ్మ’ ఇళ్లకు ఇసుక కొరత

- ముందుకు సాగని ఇళ్ల నిర్మాణం
- ఇసుక ఉచితంగా అందించాలంటున్న లబ్ధిదారులు
- అధిక ధరలతో లబ్ధిదారులపై భారం



పెగడపల్లిలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

పెగడపల్లి: రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లు నత్తనడకన కొనసాగుతున్నాయి. ఇసుక కొరతతో ఇళ్ల నిర్మాణం ముందుకు సాగడం లేదు. ప్రభుత్వం లబ్ధిదారులకు ఇసుకను ఉచితంగా ఇవ్వాలని అధికారులను ఆదేశించినా మండలంలో ఇసుక రీచ్‌లు లేకపోవడంతో మండలంలో సీఎం ఆదేశాలు అమలు కావడం లేదు. ఇసుక అనుమతి కోసం టోకెన్లు ఇవ్వాలంటూ తహసీల్దార్‌ను సంప్రదిస్తే మండలంలో ఇసుక లేని కారణంగా టోకెన్లు ఇవ్వలేమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభానికి ముందు మండలంలో పక్క మండలాల నుంచి ఒక ట్రాక్టర్ డబ్బాకు రూ. 2500 నుంచి రూ. 3 వేలకు దళారులు తెచ్చి పోసేది. ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభం తరువాత ఇసుక అక్రమంగా తరలించేందుకు అక్రమదారులు ఇసుక ట్రాక్టర్‌కు రూ. 6 వేలకు పెంచేశారు. దీంతో లబ్ధిదారులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇసుక కొరత కారణంగా ధర పెరిగితే ఇదే అదనుగా భావించి కట్ రాతుకు కూడా ధర అమాంతం పెంచేశారు. ఇళ్ల నిర్మాణం కోసం కొంత మంది దళారులు అధిక ధరలకు విక్రయిస్తూ కాసులు దండుకుంటున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. పెగడపల్లి మండలానికి మొదటి విడతగా 499 ఇళ్లు మంజూరయ్యాయి. 300 ఇళ్లకు అధికారులు ముగ్గు పోశారు. 75 ఇళ్లు వివిధ కారణాలతో రద్దయ్యాయి. మండలంలో పైలట్ ప్రాజెక్టు కింద ల్యాగలమర్రిని ఎంపిక చేసి 78 ఇళ్లు మంజూరు చేశారు. వీటిలో 30 ఇళ్లు నిర్మాణంలో ఉండగా, 20 మంది లబ్ధిదారులు ఇళ్లు వద్దని చెప్పడంతో రద్దు చేశారు. మిగతా 20 మంది లబ్ధిదారులకు నోటీసులు జారీ చేశారు. ఇళ్ల నిర్మాణం ప్రారంభించినప్పటి నుంచి ఇసుక మొదలుకొని సిమెంట్, స్టీలు, మేస్త్రీల రేటు, కూలీలు ఇలా అన్నింటికీ ధరలు పెరగడంతో ప్రభుత్వం ఇచ్చే రూ.5 లక్షలతో ఇల్లు నిర్మాణం పూర్తయ్యేనా అంటూ లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇసుక, స్టీల్ ఇతర సామగ్రి ధరలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ధరలు పెరిగాయి



ఇళ్ల నిర్మాణానికి అవసరమయ్యే అన్ని రకాల సామగ్రికి ధరలు పెరిగాయి. ఇసుక, కంకర, స్టీలు, సిమెంటు ధరలతో పాటు కూలీలు, మేస్త్రీలు కూడా ధరలు పెంచారు. ప్రభుత్వం నుంచి అందే రూ.5 లక్షలతో ఇళ్లు పూర్తికాదు. అదనంగా మరో రూ. 10 లక్షలు వెచ్చిస్తే కాని ఇల్లు పూర్తయ్యే అవకాశం ఉంది.

– కుందేళ్ల లక్ష్మి, ల్యాగలమర్రి

సంతోషంగా ఉంది



ఇందిరమ్మ పథకం కింద ఇల్లు మంజూరు చేయడం సంతోషంగా ఉంది. ఇల్లు కట్టేందుకు ఉపయోగించే సామగ్రికి ధరలు అమాంతం పెరిగాయి. ఈ పథకం కింద ప్రభుత్వం ఇస్తున్న రూ. 5 లక్షలు ఎటు సరిపోయేట్టు లేవు. ఉచితంగా ఇసుకను సరఫరా చేసి, ఇతర సామగ్రి ధరలు తగ్గించాలి.

– జూపాక దేవవ్వ బతికపల్లి

ముగ్గులు పోయకుంటే ఇల్లు రద్దు



ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు సకాలంలో ముగ్గులు పోసుకోవాలి. ఆర్థిక సమస్యలుంటే ఐకేపీ నుంచి రుణం ఇప్పిస్తాం. లబ్ధిదారులకు ఒకటికి రెండు సార్లు కలిసి నిర్మాణం చేపట్టాలని పోత్సహిస్తున్నాం. అయినా ముందుకు రాని లబ్ధిదారుల నుంచి రద్దు పత్రాలు స్వీకరిస్తున్నాం. రద్దయిన ఇళ్లను ఇతరులకు కేటాయిస్తాం.

– శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో

విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు ఇవ్వాలి



రాయికల్ బాలికల ఉన్నత పాఠశాల, రాయికల్‌లో మాత్రలు వేస్తున్న వైద్య అధికారులు, సిబ్బంది

సారంగాపూర్: ప్రతీ విద్యార్థికి అల్బెండజోల్ మాత్రలను అందించాలని జిల్లా మాతాశిశు సంరక్షణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జయపాల్‌రెడ్డి అన్నారు. నులిపురుగుల నిర్మూలన దినోత్సవంలో భాగంగా సారంగాపూర్ కస్తూర్బా బాలికల విద్యాలయంలో అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని బాలికలకు అందించి ప్రారంభించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి వీణ, మండల వైద్యాధికారి రాధారెడ్డి, వైద్యసిబ్బంది, కేజీబీవీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోరుట్ల/కోరుట్ల రూరల్/రాయికల్/మల్లాపూర్/ఇబ్రహీంపట్నం/పెగడపల్లి/వెల్గటూర్/మల్యాల: జిల్లా వ్యాప్తంగా, పట్టణాలు, మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు సోమవారం అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. నులిపురుగులు పిల్లల్లో వ్యాప్తి చెందడం వల్ల రక్తహీనత, పోషకాహార తగ్గుదల వంటి వ్యాధులను ప్రబలుతాయని, 1 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా మాత్రలు వేయాలని వైద్య వైద్యాధికారులు కోరారు.

13 వరకు రైతు బీమా దరఖాస్తు గడువు

జగిత్యాలరూరల్/రాయికల్/బుగ్గారం: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రైతులకు బీమా సౌకర్యం కల్పించేందుకు జూన్ 5 వరకు పట్టాదారు పాస్‌బుక్ పొందిన వారికి రైతు బీమా తీసుకునేందుకు ఈనెల 13 చివరి తేదీ అని జగిత్యాల రూరల్ ఏఈవో తిరుపతినాయక్, రాయికల్ ఏవో ముక్తేశ్వర్, బుగ్గారం ఏవో అక్షిత తెలిపారు. 18– నుంచి 59 సంవత్సరాలలోపు వయస్సు గల నూతనంగా పట్టాదారు పాస్‌బుక్ పొందిన రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాల కోసం సంబంధిత ఏఈవోలను సంప్రదించాలని పేర్కొన్నారు.

సహస్ర లింగాల ఆలయంలో ప్రత్యేక పూజలు

జగిత్యాలరూరల్: మండలంలోని పొలాస సహస్ర వెయ్యి లింగాలస్రాలయంలో శ్రావణ సోమవారం పురస్కరించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు సహస్త్ర లింగాల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నిరుపేదలందరికీ ఇళ్ల నిర్మాణం



ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్: నిరుపేదలందరికీ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయిస్తామని మాజీమంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం జగిత్యాలరూరల్ మండలం రఘురాములకోట, తిమ్మాపూర్, జాబితాపూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. గత ప్రభుత్వం ఒక్క ఇంటిని నిర్మించలేదన్నారు. రేషన్‌కార్డులు అర్హత ప్రతిపాదికన మంజూరు చేస్తున్నామని పేర్కొన్నారు. బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజంగి నందయ్య, పార్టీ మండల అధ్యక్షుడు జున్ను రాజేందర్, శ్రీరాముల గంగాధర్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు స్వామిరెడ్డి పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

పెగడపల్లి: మండలంలోని వెంగళాయిపేటలో అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళకు మెరుగైన వైద్యం కోసం మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చొరవతో రూ. 2.50 లక్షల ఎల్‌వోసీ మంజూరైనట్లు మండల కాంగ్రెస్ నాయకుడు కడారి తిరుపతి సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన మునీర బేగం అనే మహిళ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె చికిత్స కోసం మంత్రి లక్ష్మణ్‌కుమార్ ఎల్‌వోసీ మంజూరు చేయించారు. ఈ సందర్భంగా మంత్రికి బాధితురాలి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

తిరంగా బైక్ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

మేడిపల్లి: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మండల అధ్యక్షుడు చిట్యాల సురేశ్ ఆధ్వర్యంలో బీజేపీ మండల నాయకులు సోమవారం తిరంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. నినాదంతో ప్రజలలో జాతీయ భావం పెంపొందించే విధంగా స్వాతంత్రం కోసం మహనీయులు చేసిన పోరాటాలని స్మరించుకుంటూ, ప్రతి ఒక్కరిలో దేశం పట్ల, పౌరులలో జాతీయ భావం పెంపొందించడమే లక్ష్యమని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ ఎస్ఎన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోస్కి మధు, తిరుపతి రెడ్డి, ధర్మ రెడ్డి, మేకల రాజు,హనుమండ్లు, హనుమాన్ చారి పాల్గొన్నారు.

యాదవులు చైతన్యంగా ఉండాలి

కథలాపూర్: యాదవులు చైతన్యంగా ఉండాలని ఆ సంఘం అడ్‌హక్ కమిటీ జిల్లా అధ్యక్షుడు గానవేని మల్లేశ్‌యాదవ్ కోరారు. సోమవారం కథలాపూర్ మండలం పోసానిపేట గ్రామంలో యాదవులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో యాదవులు కలిసి మెలిసి ఉండి స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు బొడ్డు బాలు, వేణు, సాగర్, మధు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా ఓపెన్ జిమ్‌లు..

- దెబ్బతిన్న పరికరాలు
- విరిగిన ఫెన్సింగ్ గేట్
- కొంత భాగం మట్టి తేలిన ఫ్లోరింగ్
- పట్టించుకోని అధికారులు

కోరుట్లటౌన్: శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం, ఆహ్లాదం, ఆనందం, ఆరోగ్యం అందించే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు.. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో దెబ్బతింటున్నాయి. కొన్ని పరికరాలు తుప్పుపట్టగా, ఫ్లోరింగ్ దెబ్బతిని మట్టి తేలింది. చుట్టుపక్కలా చెట్ల పొదలు పెరిగి అపరిశుభ్రంగా ఉన్నాయి.

రెండు చోట్ల ఓపెన్ జిమ్‌లు..

కోరుట్ల పట్టణంలో రెండు చోట్ల ఓపెన్ జిమ్‌లు ఉన్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం, కల్లూర్‌రోడ్‌లో కోరుట్ల ఎమ్మెల్యే భవనం దగ్గర ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. ప్రపంచ బ్యాంకు, తెలంగాణ మున్సిపల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు (టీఎండీపీ) కింద రూ.30 లక్షలు నిధులు ఖర్చుపెట్టి, మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేశారు. పట్టణంలోని కల్లూర్‌రోడ్‌లో 4 ఏళ్ల క్రితం రూ.15 లక్షల నిధులతో మొదటి ఓపెన్ జిమ్, 2 ఏళ్ల క్రితం రూ.15 లక్షల నిధులతో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రెండో నిర్మాణం పనులు పూర్తి చేశారు. ప్రతి రోజూ ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుండి 9 గంటల వరకు తెరచి ఉంచి పని వేళలు నిర్ణయించి, పర్యవేక్షణ సిబ్బందిని నియమించారు.



కోరుట్ల కల్లూర్ రోడ్‌లో గేట్ దెబ్బతిన్న ఓపెన్ జిమ్

తుప్పు పడ్తున్న పరికరాలు

పట్టణంలోని కల్లూర్‌రోడ్‌లో కోరుట్ల ఎమ్మెల్యే భవనం దగ్గర ఉన్న ఓపెన్ జిమ్ అధ్వానంగా తయారైంది. ఓపెన్ జిమ్ లోపల, ఫెన్సింగ్ చుట్టూ చెట్ల పొదలు బాగా పెరిగాయి. ఫెన్సింగ్ గేటు విరిగిపోయింది. ఫ్లోరింగ్ దెబ్బతిని, మట్టి తేలింది. పరికరాలు కొన్ని పరికరాలు తుప్పు పట్టడంతో పెద్దలు, పిల్లలు సాధన చేయడం ఇబ్బందిగా మారింది. అదేవిధంగా జూనియర్ కళాశాల మైదానంలో కొన్ని పరికరాలు పని చేయడం లేదని వ్యాయామ క్రీడాకారులు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు పట్టించుకుని ఓపెన్ జిమ్‌లు సౌకర్యవంతంగా ఉండేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



ఫ్లోరింగ్ దెబ్బతిన్న జిమ్



రోడ్డు పక్కనే మెడికల్ వ్యర్థాలు

కోరుట్లరూరల్: గ్రామాల్లో వైద్యులు ఉపయోగించిన మెడికల్ వ్యర్థాలను భద్ర పరిచి గ్రామ పంచాయతీ చెత్త బండికి ఇవ్వాల్సి ఉంటుంది. అందులో సింగిల్ యూజ్ ఇంజక్షన్లు, సెలైన్ పైపులు, వగైరా ఉంటాయి. కాగా మండలంలోని మాదాపూర్ శివారులో మాదాపూర్–పైడిమడుగు రోడ్డు పక్కనే పారవేస్తున్నారు. దీంతో గాలికి వ్యర్థాలన్నీ చిందర వందరగా రోడ్డు పైకి వస్తున్నాయి. గ్రామ పంచాయతీ అధికారులు సదరు వ్యక్తులను గుర్తించి మరో సారి ఇలా రోడ్డు పక్కన వ్యర్థాలు పడేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
ఓదెల రామకృష్ణ, ఎంపీడీవో, కోరుట్ల, సెల్ నంబర్ : 9849900097

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ దొందూ దొందే



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పెగడపల్లి: తెలంగాణలో పాలన మారిందని పాలకులు మారలేదని పేదల కడుపు కోతలు మాత్రం తీరడం లేదని కాంగ్రెస్, బీఆర్‌ఎస్ దొందు దొందేనని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దొనికల నీవన్ అన్నారు. సంపర్క్ అభియాన్‌లో భాగంగా మండల కేంద్రంలో సోమవారం బీజేపీ నాయకులు బైక్‌ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కేంద్రం ప్రభుత్వం అందిస్తున్న నిధులతోనే పల్లెలు అన్ని రంగాల్లో అభివృద్ధి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచ దేశాల్లో విశ్వ గురువుగా ప్రఖ్యాతి పొందిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పల్లె మోహన్‌రెడ్డి, నాయకులు కొమురెల్లి, అనసూర్య, గట్టయ్య, మల్లేశం, శ్రీరామ్ అంజన్న, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

యూరియా అందుబాటులో ఉంచాలి

కథలాపూర్: మొక్కజొన్న, వరి పంటలకు యూరియా అవసరమని, యూరియాను ప్రభుత్వం అందుబాటులో ఉంచాలని రైతు ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షుడు బద్దం మహేందర్‌రెడ్డి కోరారు. సోమవారం కథలాపూర్‌లో ఆయన మాట్లాడుతూ... అష్టకష్టాలు పడి పంటలు సాగు చేస్తే యూరియా కొరత వల్ల ఇబ్బందిగా మారిందన్నారు. రైతులకు సరిపడేలా యూరియాను సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు గడ్డం శేఖర్‌రెడ్డి, జవిడి తిరుపతిరెడ్డి, బద్దం మహిపాల్‌రెడ్డి, ప్రిన్స్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇసుక డంపులు సీజ్

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాల గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను సీజ్ చేసినట్లు ఆర్‌ఐ నాగేశ్ సోమవారం తెలిపారు. అక్రమంగా ఇసుకను నిల్వ ఉంచారనే సమాచారం మేరకు రెవెన్యూ సిబ్బందితో కలిసి తనిఖీ చేశామన్నారు. సుమారు 10 ట్రాక్టర్ల ఇసుక కనిపించడంతో సీజ్ చేశామని ఆయన పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సీజ్ చేసిన ఇసుకను ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉచితంగా ఇస్తామన్నారు.

కంటి వైద్య శిబిరం

మెట్‌పల్లి: పట్టణంలోని రెడ్‌క్రాస్ భవనంలో సోమవారం లయన్స్ క్లబ్, పద్మాక్షి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో రేకుర్తి కంటి ఆసుపత్రి వైద్యులు పాల్గొని 600మందికి పరీక్షలు జరిపారు. ఇందులో 40మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు వెల్ముల శ్రీనివాస్‌రావు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు పుప్పాల సాగర్, సంధ్యారాణిల తదితరులు ఉన్నారు.

తహసీల్దార్‌కు యాదవ సంఘం సభ్యులు వినతి

కథలాపూర్: మండలంలోని గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన యాదవ సంఘం సభ్యులు సోమవారం తహసీల్దార్ వినోద్‌కు వినతిపత్రం సమర్పించారు. గ్రామశివారులో ప్రభుత్వ భూమిని గొర్రెలు, మేకలు మేసేందుకు కేటాయించాలన్నారు. గతంలో అప్పటి ఎంపీ పొన్నం ప్రభాకర్ 5 ఎకరాలు, అప్పటి జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ 5 ఎకరాలు యాదవుల కోసం కేటాయించారని, ప్రస్తుతం ఆ భూమిలో మేకలను, గొర్రెలను మేపితే ఇతరులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని, మేకలు, గొర్రెలు మేసేందుకు 25 ఎకరాల భూమిని కేటాయించాలని వినతిపత్రంలో కోరారు.

ఎండపల్లిలో ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపాలి



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

వెల్గటూర్: ఎండపల్లిలో ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపాలని మాజీ సర్పంచ్ మారం జలంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం గ్రామస్తులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. మండలం ఏర్పాటై రెండేళ్లయినా ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపడం లేదని, నూతన మండల కేంద్రం ఏర్పాటుతో బస్సుల స్టాప్ లేక అధికారులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి లక్ష్మణ్ కుమార్ స్పందించి ఆర్టీసీ డీఎం తో మాట్లాడి ఎండపల్లిలో ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎండపల్లి మాజీ ఉపసర్పంచ్ సతీష్, బీఆర్‌ఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.